# ఎందుకు ?

## శ్రీ వీరాజీ

అదృశ్య చిత్రకారు డెవరో తన కుంచెతో అలౌకికమైన వర్ణచిత్రాలను వేస్తున్నట్లు ఆకాశంమీద సంధ్య. కొన్ని క్షణాల్లో రాత్రి వస్తుందని కాదు గాని యింటికి పోవాలనీ, సినిమాకు అందుకోవాలనీ తహతహపడే నగరవాసులతో బాట రద్దీగా ఉంది. అన్ని దిక్కులా సందడిగా ఉంది.

రివ్వున సైకిలు దిగిన నన్ను చూస్తూనే అప్పన్న కిళ్లీలు కడుతున్నవాడల్లా తలఎత్తి చూసి—"రండి బాబూ ! యిదో మీ కిళ్లీయే కడుతున్నా" నన్నాడు—

"నాలుగు చార్‌మినార్ యియ్యవోయ్."

"ఒక, జింజరు కొట్టు .... జల్దీ .... పోవాలి."

"అప్పన్నా ! మంచివాడివి గాని రెండు గోల్డ్‌ఫ్లేకు యిచ్చి పద్దు రాసుకో ....... "

"అదుగో .... అదే అప్పన్నా నీతో గొడవ .... కాస్త రాలనీ .... జర్దాతో మేడలు కట్టవుగా .... "—

అప్పన్న కొట్టు రద్దీగా ఉండే వేళ అదే. అప్పన్న అందరికీ సమాధానాలూ, వస్తువులు కలిపి యిస్తూనే నా కిళ్లీ కడుతున్నాడు.

"కాస్త పిప్పరమెంటు పువ్వు వెయ్యి" నేను చెప్పాను.

"ఓ .... వేసేనుగా .... నాకు తెల్సు .... మీ కిళ్లీ స్పెషల్" అంటూనే కిళ్లీ అందించేశాడు.

కిళ్లీలో పిప్పరమెంటు పువ్వు ఉండదని నాకు తెలుసు. ఎందుకులే వాడి పిల్లల తాపత్రయం వాడిది. మరి యిలాంటి చిన్నమెత్తు లాభాలే కదా వ్యాపారం అనుకున్నాను.

"బాబూ ! ఒక్క డబ్బిచ్చుకో .... నీ కడుపు చల్లగా .... చక్కని చుక్క వస్తాది"—నులిపేసిన కాగితంలా, ముడుతలు పడ్డ మొహం .... ముగ్గు బుట్టలాంటి మొహం ..... ఒకచేత క్రరా ..... రెండో చెయ్యి చాపింది ముష్టిది. అప్పుడే వెలిగిన మెర్క్యురీ ట్యూబులైటు నైలాను కాంతులు దాని ముగ్గు బుట్ట తలలో దోబూచు లాడుకుంటున్నాయి.

"రోజా యిదో వాడుక ఏమిటి అవ్వా నాకు" జేబులు తడుముకున్నాను నేను. అప్పన్న కొట్టుకేసి తిరిగేను. అప్పన్న ఆకులకి సున్నం రాస్తూనే .... "దానికాడ చిల్లరకేం కొదవ బాబూ ! అయిదు రూపాయలకి కావాలంటే నయా పైసలు లెక్కెట్టి పోస్తది" అన్నాడు నా అవసరం గుర్తించి.

"అప్పన్నబాబు మాటకేం గాని బాబయ్యా! కాని డబ్బు వొడెయ్యండి"—ముసిల్ది .... పాపం .... ఏ వయస్సులో యిది ముష్టెత్తుకోవల్సి వచ్చింది?' ఐనా అది ఎంతమందిని పోషిం చాలో ? ఏమో ? బహుశా పోలీసుల్ని తప్పించుకు తిరిగే పోకిరీ కొడుకూ .... దారంట వారంట విటులను వెతుక్కొనే కూతురు, కన్నూ కాలూ లేని మనుమలు యేమో .... ఎన్ని కాని డబ్బు లైతే దాని అవసరం తీరుతుంది.

బాధ్యతలు ముష్టివాళ్లకైనా తప్పవా ? ..... అసలవి బాధ్యత లేమిటి ? అనుబంధాలు కాని. ఏమైతేనేం ? నా చదువుకోసరం నేను సైకిలుమీద అవుళ్లో రెండున్నర సంవత్స రాలుగా ఉంటున్నా. ముసిల్ది రోజా నన్ను పలకరిస్తుంది. రోజా కాన్డబ్బు అడుక్కుంటుంది.

నిత్యమూ నాకు చక్కని చుక్క వస్తదని శుభం చెబుతుంది. నేనీ సంగతే శ్యామలతో అందా మనుకుంటాను. "నీ గురించే రోజా ఆ ముష్టిది నాకు సోది చెబుతుంది. నీ అందం గురించే నాకు రోజా ఆ ముసిల్ది డబ్బు తీసు కుని హామీ యిస్తుంద" ని. కాని చెప్పలేకపోయేను. శ్యామల దగ్గర భయమా ? ముసిల్దానిమీద ప్రేమా ? ఎందుకో ?

అప్పన్న దుకాణంమీద రద్దీ ఎప్పుడూ ఉంటుంది. కాని ఆవేళ లేదు. వాన కురుస్తున్నది. మొన్న పట్టింది ముసురు. నిన్న ఆదివారం. ఇవాళ అప్పన్న కొట్టు మీద రద్దీ పల్చబడింది. రోడ్లు చితచిత లాడుతున్నాయి. ఈదర గాలి వీస్తున్నది. దీపం చుట్టూరా ఒకటే అరా గుడ్డి యీగలు వాలుతున్నాయి. అప్పన్న కొట్లో రేడియో వెచ్చని కుంపటిలా వెలుగుతూ, ప్రియురాలి కౌగిలిలా సన్నగా పాడు తున్నది.

"ఈ ముసిల్ది పాపం .... ఎన్నాళ్లయ్యిందో పాపం ముష్టి ఎత్తుకుంటోంది. ఏ చెట్టుక్రిందో ఉంటుంది"— రెండుసార్లు పాపం అన్నమాట మాత్రం విన్నాడు అప్పన్న.

"ఆదేంటి పాపం పాపం .... అంటారు బాబూ మీరు. డబ్బును చూస్తే పాపం ఏంటి ? చలి ఏంటి ? అద్ది యిప్పుడే గదా నాకాడ నోట్లు మార్చుకుపోయింది."—అప్పన్న మాటల

వెట్ల నాకు ఆశ్చర్యం ఎందుకు కలగాలో అప్పన్న గమనించలేదు.

"నోట్లా ?"

"అవునండీ .... రోజు కది ఐదురూపాయి లార్జిస్తుంది .... నాకాడ చిల్లరంతా యిచ్చి నోటు తీసుకుంటాది" అప్పన్న కిళ్లీ కట్టి అందించి "ఛీ ! ఏం ముసురో. బిజినెస్సు డల్లయిపోనా ద" న్నాడు.

"బాబూ ! ధర్మం .... దిక్కుమాలిందాన్ని"—ఆశ్చర్యం ముసిల్దే .... కుళ్ళ గోనెపట్టా కప్పుగుంది. అక్కడక్కడా కిరసనాయిలు డాగుల్లాగ దానిమీద మరకలున్నాయి.

"ఏయ్ ! ముసిలీ నీకు వానా, వరదా లేదూ ...... కొంపా గోడూ లేదూ .... " నేను దూరంగా జరిగి చీదరించుకున్నాను.

"కొంపేంటి నాయనా ! నాలాంటి దిక్కుమాలిందానికి. అయన్నీ మీలాంటి మారాజులకి .... ఒక్కదాన్ని ...... మీరో కానీ ......, ఆరో కానీ యిస్తే చాలు బాబూ !"—చలి జ్వరం వచ్చిందో .... చలికే వణుకుతుందో .... అణాకాసు పడేసి అక్కణ్ణించి రిక్షా ఎక్కిపోయేను నేను. వాన వస్తే నా సైకిలు కూడా రాదు రోడ్డుమీదికి. బురద అంటే భయం నాకు. కాని యీ ముసిల్ది పాపం. అడుక్కోనిదే గడవదు కాబోలు .... ఐనా మన దేశంలో యీ ముష్టి "వృత్తి" లాగే పెరుగుతోందే ? ఎందుకు .... నన్ను యీ ముసిల్దాని ఆలోచనలు పీడలాగ ఆవహించి వదలకుండా ఉన్నాయి.

పాఠాలు చదువుకోవాలి .... చాకలిదాని దగ్గరకెళ్లి బట్టలు తెచ్చుకోవాలి. .... రాఘవతో చెప్పొడాలి .... శ్యామల రేపు కాలేజీకొస్తే ఆదివారం ప్రోగ్రాం మాట్లాడుకోవాలి. యివన్నీ ఆలోచనలే .... ముసురుపడితే అన్నీ ఉత్త ఆలోచనలే గాని యీ ముసిల్దాని ఆలోచన ఎందుకూ ? నాకు—

ఐదురూపాయ లార్జిస్తుందా అది రోజుకి ? మరేం చేస్తుంది. నా పరిశోధనమీద నాకు నమ్మకముంది. దానిమీద ఆధారపడేవాళ్ళు చాలామంది ఉండొచ్చును.

"నాలాంటి మారాజులకా ? యిల్లు ? ఏవీ .... మా తాతగారిదీ అద్దెకొంపే .... మా నాన్నగారు అంటే మేం మా వూళ్లో ఉంటున్నది అద్దెకొంపే. దానికేం తెల్సు .... దాని బ్రతుకే హాయి....

వానాకాలం వెళ్లింది. శీతాకాలం వచ్చింది. అదీ వెళ్లింది. అప్పన్న కొట్టుదగ్గర ముసిల్ది ఎండిపోయిన అరటి దొప్పలా అవుతున్నది. కాలేజీలలో, కోర్సులు ఎలాగో అవుతున్నాయి.

అప్పన్న బాకీ అడిగేడు. "పద్దు చెల్లించరా బాబూ?" అన్నాడు. నా మొహం కళావిహీనమైంది. "రేపు అప్పన్నా" అన్నాను. నాదగ్గర పావలా ఉంది. రాఘవేంద్రరావు పాతికకి తక్కువ కాకుండా ఏభైకి ఎక్కువ కాకుండా చూస్తా, రూముకి రా అన్నాడు. అప్పుచేయాలి. అప్పులు తీర్చాలి. ముసిల్ది మాత్రం మరింత ముసిలిగా "బాబూ !" అన్నది. "ఎందుకూ ?" అన్నాను నేను. "ఇంకెందుకు ? .... నీ పెళ్లాం సక్కని సుక్క అవ్వాలని నేను భగవంతుణ్ణి ప్రార్థించొద్దేంటి ?" నవ్వింది బొక్కిపళ్లతో డొక్కు దవడ లూగుతూవుంటే గాజుకాయల్లాంటి కళ్ళు కదిపి.

"ఏడిశావ్ !" అని అణాకాసు పడేశాను నేను ...... "

"నాకు ఫస్టుక్లాసు రావాలని అడుగు, దేవుణ్ణి" యీ మాటలు మాత్రం లోపలే అనుకున్నాను.

అప్పు దొరికింది. అప్పు తీర్చాలని మిట్టమధ్యాహ్నం యింటర్వెల్‌లోనే అప్పన్న కొట్టుకి బయల్దేరాను నేను.

అప్పన్న ప్రసన్నంగా, పద్దు చెల్లు పెట్టుకొని పిప్పరమెంటు పువ్వు, ఏలకులు అవీ దట్టించి మరీ కిళ్లీ కడుతున్నాడు.

"అదుగోనయ్యా ! ముసిల్దాని తస్సదియ్య. అంత దూరం చూపెలా ఆనతాదో .... చూసిందంటే చాలు మిమ్మల్ని గద్దలాగొస్తది"—అప్పన్న మాటలకి గభిక్కున నేను రోడ్డు మీదికి చూశాను.

ముసలమ్మ కఱ్ఱ సాయంతో అటువేపు పేవ్‌మెంట మీదనించి దిగి, అప్పన్న దుకాణంకేసి వస్తున్నది. అదే క్షణంలో అటు మలుపులో లారీ హారన్, యిటునించి ఒక స్కూటర్ హారన్ వేసేయి.

నేను ముసిల్దానిగురించి ఆగేటంత మూర్ఖుణ్ణి గాను. అవకాశ మయితే దాటేద్దా మన్నట్లు, చెంగున, (ఒక చేత కిళ్లీ నోటకుక్కుకునే)....నా సైకిలుమీద కెగిరిపోయేను.

లారీ వచ్చింది కుడివేపుకి. దాని తప్పేకాని, లారీలకది అలవాటు కూడాను. స్కూటర్ నన్ను ఢీకొనవల్సిందే .... లేకపోతే లారీ క్రిందకి దూరి పోతుంది. కాని మూడు వాహనాల మధ్యకి మూడుకాళ్ల ముసిల్ది వచ్చేసింది.

"బాబయ్యా"—లారీ వెంట్రుకవాసిలో తప్పింది కాని ముసల్దాని కఱ్ఱ పడిపోయింది దాని మడ్‌గార్డ్ తగిలి. నాకు ఏంచేయాలో తోచలేదు. హాండిల్‌బార్ గిర్రున తిరిగింది. నన్ను ఢీకొనే స్కూటర్ కఱ్ఱకోసం వంగిన ముసిల్దాన్ని మట్టేసింది.

"అమ్మో ! భగమం ...." అంతే ముసల్దాని స్పృహ పోయిఉంటుంది.

నా నాలి క్కర్చుకుంది. నోటంట తాంబూలం పండి కాదు నెత్తురు కారిపోతున్నది. స్కూటర్‌మీద కూడా యువ

కుడే ఉన్నాడు ...... కోటుతో సహా తడిసిపోయే డతగాడు. జనం గుసిగుసలాడేలోపున మాకు నోరు పెగల్లేదు. ఆయాసంతో వగర్చి లేచాను. స్కూటర్‌వాలా పారిపోవడం చాత కాక "అరె ! అరె ! డాక్టర్ ! యిక్క డెవరేనా డాక్టర్" అంటున్నాడు. నాలిక తెగినట్లుంది ఉచ్చారణ.

ఇంతకీ లారీ పారిపోయింది. జనం లారీల దూకుడు గురించి, దౌర్జన్యధోరణిగురించి చర్చలు సాగించుకొంటున్నారు.

నేను సైకిలు అట్టే వదిలి అంబులెన్సుకి ఫోను చేసేను.

స్కూటర్‌వాలా అంటున్నాడు .... "పాపం లారీ క్రింద పడిపోయింది. అసలు దీన్ని రక్షించగలమనే భ్రమలో మేం యిద్దరం తుక్కు తుక్కు అయిపోదుము."—

"అదేమయ్యా ! నీ బండికింద కాదూ.... పడతా" అన్నాడు ఒకడు. "నాన్‌సెన్సు .... " అన్నాడు స్కూటరు వాలా.

"పాపం ! ఆస్పత్రికి మొదట చేర్పిద్దాం ఉండండి" అన్నాను నేను.

అప్పన్న బడ్డీలోనుంచి చూసి ...... "లాభంలేదు బాబు ! ముసిల్దాయి.... నూకలు నిండుకున్నాయి" అన్నాడు.

ఒకరు జటకాను పిలిచేరు. వలుగురు నెత్తురుతో తడిసిన ముసలిదాన్ని అందులో పారేశారు.

"ఇస్తారులే ! యీ పెద్దమనుసులు అయిదు రూపాయిలు"—హామీ యిచ్చాడు జటకావాడికి ఆవారా వృత్తిలో ఉంటున్న 'బుష్‌కోటు' ఒకడు.

నేను స్కూటర్‌వాలా మొహం చూసేను. అతగాడు దీనంగా నా మొహంలోకి చూశాడు. ఇద్దరం దారుణమైన ప్రమాదానికి గురియైన ముసలిదాని ప్రాణాలను తీసిన హంతకుల మన్నట్లు జనం చూశారు.

"సరే ! .... ఆ లారీ దొరక్కపోదు....నేను రిపోరు యిస్తానన్నాడు" స్కూటర్‌వాలా. నన్నుచూసి "పదండి పాపం ! ఎడ్మిట్‌చేసి పోదాం" అన్నారు. మూగవాడిలా అనుసరించాను.

"ఇంతకీ పోలీసులు యిన్వెస్టిగేట్ చేసేది దిబ్బ ...... యింతసేపయ్యింది లారీవాడు పారిపోయి ఉంటాడు ......"— తోవలో అంటున్నాడు స్కూటర్‌వాలా.

ఎందుకో తెలీదు. కాని "అదేమయ్యా .... నీ స్కూటర్ మట్టేసిందికదూ .... " అన్న మాటలు రావేలేదు నానోటి వెంట.

అసలు దాని తలకాయ రోడ్డుమీద రాయికి తగిలి కన్నంపడింది. "పాపం! బ్రతుకుతుం దంటారా"—స్కూటర్‌వాలా మొహమంతా చెమటలు పోసేయి. నాకు ముసల్ది—రక్తంలో తడిసి ముద్దయిన ముసిల్ది .... ఆకుపచ్చగా ...... పసుపు పచ్చగా ...... తెల్లగా ఎండలో .... నల్లగా రకరకాలుగా అగుపిస్తూంది. కళ్ళు తిరుగుతున్నాయి.

*　　　*　　　*

ముసిల్ది బ్రతికితే ?.... ముసిల్ది చస్తే?....ఏమో ..... మేం యిద్దరం, యివతల లోపల మా పెళ్లాలు పురిటి నొప్పులు పడుతూంటే ఆందోళన పడుతున్నట్లు కూచున్నాం. ఎందుకు ? నా సైకిల్‌క్రింద పడి మనిషి చావదు. ఏమో ముసిల్దాని ప్రాణం ..... కొడిగట్టి ఆరిపోతూవున్న దీపం .... కాని అది నా సైకిల్ క్రింద పడలేదు. నా కాని డబ్బు కోసరం .... యీ దారుణమైన ప్రమాదానికి గురైంది. ఇక స్కూటర్‌వాలా .... తన చక్రాలక్రింద పడలేదని బుకాయించేసేడు. అందుకు సాక్ష్యం నన్ను నిలబెట్టేడు కూడాను. నాకు తెలుసు .... అతగాడికి తెలుసు....కాని ఎవరికీ తెలియదు. ముసిల్ది బ్రతుకుతుందని నా ఆశ.... ఎందుకు బ్రతకాలి? ఏమో ......

"ముసిల్ది .... యీపాటికి .... " అతగాడి మాటల మధ్యనే ఒక నర్సు వచ్చింది లోపల్నుంచి. చావాలని కాబోలు అతగాడి ఆశ !

"బ్రతకదుసార్ ...... ఒక్కసారి ప్లీజ్ .... " మమ్మల్ని లోపలికి రమ్మన్నది.

"ఇంపాజిబిల్" డాక్ట రంటున్నాడు.

"కాని తెలివి వచ్చింది .... " నర్సు.

"అదే ఆశ్చర్యం .... దాని వస్తువేదో అత్యంత ప్రాణ పదిలమైనది దానిక్కావాలి .... పాపం .... ఆశ ! తపన !! అలాంటిది ....ఐ డోంట్ థింక్ యూ బిలాంగ్ టు హర్"— డాక్టరు మాటలకి మే మిద్దరం తక్షణం "అదో ముష్టిది పాపం" అన్నాం.

"బా .... బ .... య్యా నా .... నా కా .... యి .. తం .... నో .... టు.... నా .... నా" వరుగులాంటి దాని నరాల్లో అంత నెత్తురే .... ?! కాని అంతా ప్రవహించిపోయింది. ఆశ ... చివరి శ్వాస .... అదే వుంది.

"కాని ఆ నోటు ఏమిటి .... ?"

"బహుశా, పదో ఐదో అయ్యుంటుంది—ముసిల్దానికి బ్యాంకా ? యినప్పెట్టా ? .... బొడ్డులో ఉందేమో .... " అన్నాను నేను.

'హా సర్ ! ఏమీలేదు .... " అప్పటికే వెతికింది నర్సు కాబోలు చెప్పేసింది.

నేను ఐదు కాయితం ఒకటి—అప్పుచేసిన అయిదు కాయితం నా జేబులోనించి—తీశాను. ముసిల్ది ప్రాణాలతో పోరాడుతున్నది....ఆశతో .... తన నోటు కోసరం మృత్యువుతో కుస్తీ పడుతున్నది—ఆ కాయితం, వంగి—సగం కళ్లు మూసు కుని—ఆ నెత్తురుకండను చూడలేక దాని కనులముందు ఉంచి ''అవ్వా ! నీ నోటు .... '' అన్నాను.

ముసిల్దానికి నిద్ర, తెలివి వచ్చినట్లయ్యింది. దాని కళ్లు వెలిగించిన దీపాల్లా విడ్డాయి కాని నోటును తడుము కుందికి దాని చేతుల్లేవలేదు .... ఐదు కాయితం అట్టే చూసి..

''బాబయ్యా ! .... కాయితం .... '' ఎగశ్వాసలో అంటున్నది.

నర్సు కొచ్చింది సమయస్ఫూర్తి. ఒక కాయితం మడత తెచ్చి దాని చేతిలో ఉంచి ''ఏయ్ ! ముసిలీ! అదేనా నీ కాయితం'' అన్నది.

నిస్సత్తువుగా దాని అరచెయ్యి ముడుచుకుంది. కాయితం చేతిలో తడుముకుంది .... ఏదో నమ్మకం కుదిరిం దల్లే ఉంది—అంతే .... చెయ్యి విడిపోయింది.

''నా పాణం .... నా పేనం .... నా కాయితం ... పో .... యిం .... '' ముసిల్ది యిక ముసిల్ది కాదు. కళేబరం ..... కట్టె .......

మిగతా అంతా మామూలే .... చావులు అన్నీ ఒకటే .... పోతే దిక్కుమాలిన ప్రమాదమైన ఈచావుకీ, మిగిలిన చావులకీ జరిగే అంత్యక్రియలలో తేడా ఉంది—

నేను స్కూటర్‌వాలా యిద్దరం విచారించాం. లారీ వాణ్ణి పోలీసువాళ్ల దగ్గర తిట్టేం .... ఎందుకు ?

స్కూటర్‌వాలా నేను వెళ్లే దిక్కుకి అభిముఖంగా తన స్కూటర్ త్రిప్పి .... 'థాంక్స్ సార్ ! పాపం ముసిల్ది సుఖపడిం ద'' న్నాడు .... మరో క్షణంలో మాయమయ్యాడు. ఎందుకు ? థాంక్స్ .... నా కెందుకు .......

నేను సైకిల్‌మీద అప్పన్న కొట్టు దగ్గరికి వెళ్లాను.... ఎందుకో తెలియదు. అక్కడ అప్పన్న అన్నాడు.... : ''ఏం బాబూ! జెండా ఎత్తేసిందా ?'' అని.

నేను ముసిల్ది పడ్డ జాగాలో నెత్తురు మరకల్ని చూస్తున్నాను. ''ఎందుకు బాబూ ! 'నిత్తెమూ' ఏదో ఒకటి జరగాల్సిందే .... యిల్లాంటియి మనకి అలవాటే'' నన్నాడు కిళ్లీ కడుతూనే అప్పన్న ......

కాయితం .... నోటు .... ముసిల్ది చెప్పినదాని ప్రాణం ... ''చూడు అప్పన్నా ! దాని కాయితం కాని దొరికిందా ?'' అన్నాను.

''అదేంటి బాబూ !'' అప్పన్న ఉలిక్కిపడ్డాడు ..... ''అంటే'' అన్నాడు ఆశ్చర్యపడకుండా. నేను వెతుకుతూనే అంతా చెప్పేను.

''అదా !'' నవ్వేసేడు అప్పన్న .... ''అది నోటయ్యుం టుందిలే బాబూ !'' అన్నాడు.

''ఏం నోటు ?''

''ఇంకేంనోటు బాబూ ! ముసిల్ది ఐదువందల రూపాయి లొకడికి అప్పు యిచ్చింది .... ప్రాంసరీనోటు రాయించినాది.''

''నేను కొయ్యబారి పోయినట్లయ్యాను. నా చెవులను నేనే నమ్మలేకపోయాను.

''అప్పు ? ప్రామిసరీ నోటు !''

''పాపం .... కానీ కానీ కూడెట్టింది .... '' అప్పన్న దేవుడికేసి చూసి ''అంతా ఆ భగవంతుడి మాయ'' అన్నాడు లెంపలేసుకొని.

''ఎవరి కిచ్చిం దప్పన్నా .... ''

''ఎవరికైతే ఎందుకు బాబూ యిక. ఎవరికో ఋణ ముండి యిచ్చింది. పోయింది.'' అప్పన్న నా కుతూహలాన్ని గమనించడం మొదలుపెట్టేడు....

''నేను .... నేను..... ''

''ఏం చేస్తారు బాబూ !''

''ఊహు .... కాలేజీకి వెళ్లాలి .... '' సైకిలెక్కి పోయాను.

అప్పన్న నవ్వు నా చెవుల్లో వికటంగా ధ్వనించింది .... ఎందుకు ?

ముసిల్దాని ప్రాణం .... దాని నోటు .... ఏమిటీ ? నోటు .... ఎందుకు ? .... అన్న ప్రశ్నలే మిగిలిపోయేయి.

రాఘవరావు అగుపించాడు .... ''ఏంరా ! బాబూ ! క్లాసుకి రాలేదు. అప్పుచేసి పప్పుకూడు అనీ .... చలో సినిమా కనీ పోయావనుకున్నా .... '' అన్నాడు.

''లేదోయ్ ! .... అంత భయం ఎందుకోయ్ నీకు ?'' నవ్వుతూ అడిగేను.

''ఎందుకూ?.... డబ్బు యిచ్చుకున్నవాణ్ణే నాయనా !... అప్పు తీసుకున్నవాడికేం మజాగా ఉంటుంది ! .... కాని యిచ్చిన వాడికి .... ?'' రాఘవరా వన్నాడు.

నేను నవ్వేను.

ఈ నవ్వు అచ్చం యిందాకల నా చెవులబడిన అప్పన్న ఆఖరి నవ్వులాగే ఉంది. ఎందుకు ?